జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 76వ ర్యాంక్

ఫలితాల్లో సత్తా చాటిన సిద్దిపేట విద్యార్థి



సిద్దిపేట క్రైం, జూన్ 9 : సిద్దిపేటకు చెందిన లక్ష్మీనరసింహారెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 76వ ర్యాంకును సాధించారు. 305 మార్కులతో ప్రతిభను కనబరిచారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. గతంలో వెలువడిన మెయిన్స్ ఫలితాల్లో 110 ర్యాంక్ సాధించారు. ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 12 ర్యాంక్ పొందారు. వారి తల్లిదండ్రులు శ్రీనివాస్ రెడ్డి, పద్మ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మల్లన్న దర్శనానికి గంటన్నర..

చేర్యాల, జూన్ 9 : కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకటలాడింది. వేలాదిమంది తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో మల్లన్న నామ స్మరణ హోరెత్తింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలను వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 55 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సంగారెడ్డిలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పండిత్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్

జిల్లాలో 398 భాషోపాధ్యాయ, 77 పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ

సంగారెడ్డిలో పండిత్, పీఈటీలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హెచ్ఎం ప్రమోషన్స్ సీనియారిటీ జాబితా కోసం ఎదురుచూపులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 9 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా భాషోపాధ్యాయులు (పండిత్‌లు), పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ మేరకు విద్యాశాఖ అప్‌గ్రేడ్ అయిన పోస్టుల జాబితా వెల్లడించింది. సంగారెడ్డి జిల్లాలో ల్యాంగ్వేజ్ పండిత్(ఎల్‌పీ) తెలుగు-211 పోస్టులు, ల్యాంగ్వేజ్ పండిత్(హింది)-175 పోస్టులు, ల్యాంగ్వేజ్ పండిత్(ఎల్‌పీ)ఉర్దూ-12 పోస్టులు, పీఈటీ-77 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో ల్యాంగ్వేజ్ పండిత్‌లు ఇక నుంచి ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ భాషోపాధ్యాయులుగా, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లుగా ఉన్నతీకరించబడ్డారు. కాగా, పండిత్, పీఈటీలు బదిలీలు, పదోన్నతి పొందేందుకుగాను ఆదివారం సంగారెడ్డిలోని గాంధీ సెంటినరీ హైస్కూల్‌లో పండిత్, పీఈటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. జిల్లాలో 489 పండిత్, పీఈటీలకు 475 మంది హాజరైనట్టు అధికారులు తెలియజేశారు. తాజాగా విద్యాశాఖ విడుదల చేసిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో భాగంగా (మల్టీజోన్-2) పరిధిలో ఈ నెల 8వ తేదీన జడ్పీ మేనేజ్‌మెంట్‌లో హెడ్ మాస్టర్లుగా(గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు లేదా దాని సమానమైన కేడర్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా ప్రదర్శించి, ఆదివారం అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉన్నా.. ఆర్‌జేడీ జాబితా ఇంకా ప్రదర్శించలేదు. దీంతో, అభ్యంతరాల స్వీకరణ చేపట్టలేదు. ఫలితంగా సీనియారిటీ జాబితా కోసం ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. సోమవారం ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా వెల్లడించే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

బడి బస్సు భద్రమేనా!

మెదక్ జిల్లాలో 180 స్కూల్ బస్సులు.. ఫిట్‌నెస్ పూర్తి చేసుకున్నవి 80 మాత్రమే

- గత నెల 15న ముగిసిన ఫిట్‌నెస్ గడువు
- మరో రెండు రోజుల్లో బడుల పునఃప్రారంభం
- 100 బస్సుల భద్రతపై లేని భరోసా
- 118 ప్రైవేట్ స్కూళ్లలో 41,438 మంది విద్యార్థులు



మెదక్ అర్బన్, జూన్ 9: మెదక్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల పునఃప్రారంభానికి ఆయా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు ప్రచారాలు సైతం ప్రారంభించాయి. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవేశాలపై చూపుతున్న శ్రద్ధ బడి బస్సుల ఫిట్‌నెస్‌పై చూపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా విద్యాసంస్థల బస్సుల సామర్థ్యం గడువు మే 15తో ముగుస్తుంది. ఆ తర్వాత మళ్లీ కొత్తగా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి రవాణాశాఖాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొంది, పాఠశాలల ప్రారంభం అనంతరం రోడ్లపైకి రావాల్సి ఉంటుంది.

భద్రతపై అనుమానాలు

అయితే గడువు ముగిసినా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు యాజమాన్యాలు ముందుకు రాకపోవడంతో బస్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 118 ప్రైవేటు స్కూళ్లలో 41, 438 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయా విద్యాసంస్థలకు సంబంధించి దాదాపు 180 బస్సులు ఉండగా.. కేవలం 80 బస్సులకు మాత్రమే ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. వాస్తవానికి ఇంజన్, టైర్లు, బ్రేక్‌లు, సీటింగ్ ఏర్పాట్లు, స్టీరింగ్ తదితర అంశాలను తనిఖీ చేసి అన్నీ సరిగా ఉంటేనే ఆర్టీవో అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. వారు ధ్రువీకరించకుండా ఏ పాఠశాల వాహనమైనా రోడ్డెక్కేందుకు వీలులేదు.

నేటికీ వీడని చేదు జ్ఞాపకాలు

2014 జూలై 24న వెల్దుర్తి మండల పరిధిలోని మాసాయిపేట వద్ద ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో రైలు ఢీకొన్న దుర్ఘటనలో 16 మంది చిన్నారులు బలయ్యారు. తల్లిదండ్రుల్లో ఆనాటి చేదు జ్ఞాపకాలు నేటికీ వీడలేదు. ఇంతటి ఘోరం జరిగినా స్కూల్ యాజమాన్యాలు పిల్లల భద్రతపై దృష్టి సారించకపోవడం గమనార్హం. బడి బస్సు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త పడకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంటుంది పరిస్థితి. తల్లిదండ్రులు కూడా పాఠశాలల బస్సుల భద్రతపై ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే సీజ్

ఫిట్‌నెస్ లేకుండా బడి బస్సులు రోడ్డెక్కితే వాటిని సీజ్ చేస్తాం. అంతే కాకుండా ఆ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 బస్సుల వరకు ఫిట్‌నెస్ పరీక్షలు చేశాం. మిగిలిన స్కూల్ యాజమాన్యాలు బస్సులకు తప్పనిసరిగా ఎఫ్‌సీ పొందాలి. నిబంధనలు ఉల్లంఘించి బస్సులు నడిపితే సీజ్ చేసి కోర్టుకు పంపుతాం.

-వెంకటస్వామి, మెదక్ జిల్లా రవాణా అధికారి

ఇవీ నిబంధనలు..

- బస్సు కచ్చితంగా పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సుకు ఇరువైపులా విద్యా సంస్థ పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ రాసి ఉండాలి.
- బస్సు డ్రైవర్ 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఆరోగ్యవంతుడై ఉండాలి
- ప్రతీ బస్సులో ఫస్ట్‌ఎయిడ్‌బాక్స్, అవసరమయ్యే మందులు అందుబాటులో ఉండాలి.
- హెవీ వాహనంపై డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి, కంటిచూపునకు సంబంధించిన పత్రాలు సమర్పించాలి. ప్రతీ 3 నెలలకోసారి కంటి పరీక్షలు చేయించాలి.
- ప్రతీ బస్సులో సహాయకుడు ఉండాలి. అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలి.
- చిన్న పిల్లలు ప్రయాణించే బస్సు లోపల విద్యార్థులను డ్రైవర్ గమనించేలా అద్దం అమర్చాలి
- బస్సు యజమానులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం స్లాట్ బుకింగ్ చేసుకొని సంబంధిత తేదీల్లో రవాణా కార్యాలయానికి అని పత్రాలతో వెళ్లాలి.
- ఫిట్‌నెస్ పూర్తయిన బస్సులనే ఉపయోగించాలి.



సంగారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి



మెదక్‌లో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రశాంతం

- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు
- సంగారెడ్డి జిల్లాలో 16 సెంటర్లలో 7,530 మంది..
- మెదక్ జిల్లాలో 10 సెంటర్లలో 3,125 మంది హాజరు
- పకడ్బందీ ఏర్పాట్లు.. పర్యవేక్షించిన కలెక్టర్లు

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, జూన్ 9 : సంగారెడ్డి జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 16 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,672 మంది అభ్యర్థులకు 7,530 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకున్నారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష జరగాల్సి ఉండగా అరగంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. సమయం మించిపోయిన తరువాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల, కరుణ స్కూల్‌లో నిర్వహించిన గ్రూప్ -1 పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. కాగా, సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థి నెలల కూతురిని పరీక్ష అయ్యేంత వరకు మహిళా పోలీసు ఎత్తుకొని లాలించారు.

మెదక్ జిల్లాలో 79.88 శాతం హాజరు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు మెదక్ జిల్లాలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,912 మంది అభ్యర్థులకు గానూ.. 3,125 మంది హాజరయ్యారు. మెదక్‌లో 7, నర్సాపూర్‌లో 3 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద బయోమెట్రిక్‌తో గుర్తింపు కార్డులను పరిశీలించి అభ్యర్థులను అనుమతించారు. ఉదయం 9 గంటల నుంచే అనుమతించారు. 10 గంటల తర్వాత ఎవరినీ కేంద్రంలోకి అనుమతించలేదు. మెదక్‌లో మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని అధికారులు వెనక్కి పంపారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఏఎస్పీ మహేందర్, కోఆర్డినేటర్లు, జిల్లా ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి భద్రతా చర్యలు చేపట్టారు.



మెదక్‌లో..

తాగునీటి చింత తీర్చేలా..

బొల్లారం మున్సిపాలిటీలో రూ.28.69 కోట్లతో మిషన్ భగీరథ పనులు

ఏడాదిన్నరలో 90 శాతం పూర్తి

మరో నెలలో నీటి సరఫరాకు కసరత్తు

జిన్నారం, జూన్ 9: పారిశ్రామిక ప్రాంతమైన బొల్లారం మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పనులు చివరి దశకు చేరుకోవడంతో దశాబ్దాలుగా నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కనున్నది. నీటి సమస్య పరిష్కారానికి రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం మిషన్ భగీరథ కింద రూ. 28.69 కోట్లు మంజూరు చేయగా, ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించారు. నేటికి 90 శాతం వరకు పనులు పూర్తి కావడంతో మరో నెల రోజుల్లో మిగతా పనులు పూర్తి చేసి నీటిసరఫరా జరుపుతామని అధికారులు అంటున్నారు. ఇక మున్సిపాలిటీలో పైప్‌లైన్ల కోసం తీసిన గుంతలతో స్థానికులకు నిత్యం ఇక్కట్లు తప్పడంలేదు. వర్షాలు కురిసినపుడు రహదారులపై గుంతల్లో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందిగా మారింది.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం

బొల్లారం మున్సిపాలిటీలో మూడు దశాబ్దాలుగా నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2022లో రూ.28.69 కోట్ల నిధులను మంజూరు చేసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌బోర్డు పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని కొత్త బస్‌స్టాండ్ వద్ద రూ.25 లక్షల లీటర్ల కెపాసిటీతో భారీ వాటర్ ట్యాంక్, ఔటర్ రహదారి మోడల్ పాఠశాల వెనకాల 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక పట్టణంలో 20 కాలనీల్లో సుమారు 55 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్ వేయగా, కొత్తగా 2,500 నివాసాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. మరో 1,500 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పరిశ్రమల కాలుష్యం, అడుగంటిన భూగర్భ జలాలు, 60 వేల జనాభాకు 15 రోజులకోసారి వచ్చే నీటితో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నిత్యం సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ పథకంతో బొల్లారం మున్సిపాలిటీ పారిశ్రామిక వాడలో నెలకొన్న ప్రధాన సమస్య తీరనున్నది. కాగా ఏడాదిన్నరం కాలంగా పైప్‌లైన్ కోసం కాలనీలలో తవ్విన గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బొల్లారంలో నిర్మాణం పూర్తయిన 25 లక్షల లీటర్ల కెపాసిటీ వాటర్‌ట్యాంక్

నెల రోజుల్లో నీటి సరఫరా

బొల్లారంలో మిషన్ భగీరథ పనులు 90శాతం వరకు పూర్తయ్యాయి. కొత్తగా 2,500 నల్లా కనెక్షన్లు ఇచ్చాం. ఔటర్ రోడ్డులో గల పైప్‌లైన్ నుంచి కనెక్షన్ పనులు పూర్తి చేశాం. 45 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంప్, ట్యాంకుల పనులు పూర్తి చేశాం. మరో నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసి నీటి సరఫరా చేసే దిశగా పనులు చేస్తున్నాం. పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలను వీలైనంత త్వరగా పూడ్చివేస్తాం. మున్సిపల్ ఆధ్వర్యంలో నూతన సీసీ రోడ్డు వేసేందుకు పాలకవర్గం సమాయాత్తం అవుతున్నది.

- శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ

మార్మోగిన ఏసు నామం



మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. చర్చి ఆవరణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏసు సన్నిధిలో ప్రార్థనలతో భక్తులు పరవశించిపోయారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశాన్ని చదివి వినిపించి, భక్తులకు ఆశీర్వచనాలందించారు.

-మెదక్ కల్చరల్, జూన్ 9

జహీరాబాద్ డీసీఎంఎస్ కేంద్రంలో

సోయా విత్తనాలు

- డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



శివకుమార్

జహీరాబాద్, జూన్ 9: జహీరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కేంద్రంలో, రైతు సేవాకేంద్రంలో సబ్సిడీపై సోయా విత్తనాలను అందజేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కాకూడదనే ఉద్దేశంతో రైతు సేవా కేంద్రాల్లో సోయా విత్తనాలను అంచెలంచెలుగా అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు పాసుపుస్తకాలను తీసుకెళ్లి సోయా విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. 25కిలో సోయా బస్తా ఒక్కంటికి రూ.2,750 ధర ఉండగా సబ్సిడి పోను రూ.2వేలకు ఒక్కటి చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏడుపాయలలో సందడి





ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పరిసర జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. విందు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

-పాపన్నపేట, జూన్ 9

బడుల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దు

నిజాంపేట, జూన్ 9: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించడం చట్టరీత్యా నేరమని, అటువంటి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజాంపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్, ఇతర సామగ్రిని అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీని విద్యాశాఖ అధికారులు నివారించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రోగులకు పండ్లు పంపిణీ చేసిన బజరంగ్‌దళ్

నారాయణఖేడ్, జూన్ 9: నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన భజరంగ్‌దళ్ కార్యకర్త తోట.రమేష్ 18వ వర్ధంతిని పురస్కరించుకొని భజరంగ్‌ధళ్ కార్యకర్తలు ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు రజనీకాంత్, సాయిరాం, ప్రశాంత్, నందు,నవీన్, కుటుంబ సభ్యులు అంజయ్య, రామన్న, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మునిపల్లి, జూన్ 9: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ స్వప్నభాస్కర్, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పల్లె రోడ్లు అధ్వానంగా ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెరోడ్లకు మహర్దశ సంతరించుకుందన్నారు. గ్రామాల అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారుతి, షైపాల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీల పదోన్నతి పట్ల ధన్యవాదాలు

చేగుంట, జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించినందుకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అర్హత కలిగి బీఎడ్ ఉండి నష్టపోతున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు న్యాయం చేయాలని, రంగారెడ్డి జిల్లాలో ఈ షెడ్యూల్‌లోనే బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నెత్తురోడిన రహదారులు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహారాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య నస్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2.30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్ధండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల పౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.



రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు". అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెల్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.



రంజిత్(ఫైల్)

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ చైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ చైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్ట్ చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.



ఆయిల్ పామ్ గెలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

గ్రామపంచాయతీల పాలనకు నిధుల గండం

- పంచాయతీ కార్యదర్శులపై భారం
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

కొల్చారం, జూన్ 9: నిధులు లేక గ్రామపంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా చిన్న గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేక అనేక పనులకు ఆటంకం ఏర్పడుతోంది. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. ఫిబ్రవరి 2వ తేదీవరకు సర్పంచులు, పాలకవర్గాలకు బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని కావాలన్నా సర్పంచులు ముందుగా వారి జేబులోంచి ఖర్చు చేసేవారు. తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బుల్లేని దుస్థితి నెలకొంది. వీధిదీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, పారిశుధ్య కార్మికులకు కొద్దిగా వేతనాలు సర్దుబాటు చేయడం, సింగిల్ ఫేజ్ మోటార్లకు ట్యాంకులు అమర్చడం వంటి పనులను కార్యదర్శులే సొంతంగా డబ్బులు ఖర్చు చేశారు. పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు అప్పటికే వారి పనులు, బాధ్యతతో తీరికలేకుండా ఉంటుందన్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలూ ఉన్నాయి. దీంతో వారు పంచాయతీల పాలన గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒకసారి కూడా గ్రామాలకు రావడం లేదు. దీంతో కార్యదర్శులే ముఖ్యమైన పనులు, సంతకాల కోసం ప్రత్యేకాధికారుల వద్దకు వెళ్తున్నారు.

పాలకవర్గాల ఎన్నికల తర్వాతే నిధులు


పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదలవుతాయి. జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా గ్రామాలకు విడుదల చేస్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగుమార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. ఇక రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా రావడం లేదు. నిధులు సక్రమంగా సకాలంలో రాకపోవడంతో అప్పటి పంచాయతీ పాలకవర్గాలే సొంతంగా జేబు నుంచి ఖర్చు చేశారు. కొందరు సర్పంచులు అప్పులు కూడా చేశారు. పదవీకాలం మరో ఆరునెలల్లో ముగుస్తుందన్న సమయం నుంచి సర్పంచులు కూడా డబ్బులు ఖర్చు చేయలేదు. అప్పటికే వారు ముందు ఖర్చుచేసిన డబ్బులు రావాల్సి ఉంది. ఒక్కో గ్రామపంచాయతీలో చేపట్టిన పనులకు తాజా మాజీ సర్పంచులకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రావాల్సి ఉన్నది. చేపట్టిన పనులకు తోడు ఎంబీ రికార్డులు చేసి నిధుల విడుదల కోసం ఎదురు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేక అధికారుల పాలనలో రావని, మళ్లీ పంచాయతీల పాలకవర్గాలను ఎన్నుకొన్న తర్వాతే వస్తాయని పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు చెబుతున్నారు.



రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల తిప్పలు

గ్రామపంచాయతీల్లో నిధుల్లేక చాలాచోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా పారిశుధ్య కార్మికులు తిప్పలు పడుతున్నారు. గ్రామపంచాయతీల్లో ప్రతి 500 మంది జనాభాకు ఒక మల్టీపర్పస్ వర్కర్‌ను నియమించారు. వీరు విద్యుత్ లైట్లు, పారిశుధ్యం, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. వీరికి గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.



ఎనగండ్ల గ్రామపంచాయతీ కార్యాలయం

రూ.30 లక్షల బిల్లులు రావాల్సి ఉంది



ఐదేళ్లకాలంలో ఏటిగడ్డమాందాపూర్ గ్రామంలో ఎన్నో పనులు చేశాం. పల్లె ప్రగతి, డంపింగ్‌యార్డుల నిర్మాణం, పల్లె ప్రకృతివనాల ఏర్పాటు, క్రీడా ప్రాంగణం, అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం, మిషన్ భగీరథ పనులు చేశాం. ఇప్పటికే రూ.30 లక్షల బిల్లులు రావాల్సి ఉంది.

- విష్ణువర్ధన్‌రెడ్డి, ఏటిగడ్డమాందాపూర్ తాజా మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- ఇద్దరికి గాయాలు ● దశదినకర్మకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

చేగుంట, జూన్ 9: దశ దినకర్మకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన రెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన పిట్ల కుమారస్వామి(28) మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం షమ్నాపూర్ గ్రామానికి చెందిన సమీప బంధువులైన నిజ్జని నిర్మల, నిజ్జని నర్సింలును తన బైక్‌పై ఎక్కించుకుని పెద్దశివునూర్ గ్రామం నుంచి చేగుంట మీదుగా రామాయంపేట వైపు వెళ్తున్నాడు. రెడ్డిపల్లి గ్రామ శివారులో 44వ బైపాస్‌లో ఇండియన్ పెట్రోల్ పంప్ ఎదురుగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోగా.. కుమారస్వామి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



మౌనిక మృతదేహం

చేగుంట, జూన్ 9: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కౌడిపల్లి మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన మౌనిక(22)ను చందాయిపేట గ్రామానికి చెందిన అవబోతు నవీన్‌కుమార్‌కు ఇచ్చి ఆరునెలల క్రితం వివాహం చేశారు. నవీన్‌కు గతంలోనే వివాహం జరగ్గా.. మొదటి భార్య శైలజ మృతిచెందగా.. ఆమె సోదరి మౌనికను చేసుకున్నాడు. అయితే నవీన్‌కుమార్ ఇల్లరికం అల్లుడిగా వచ్చి లింగుపల్లిలో ఉంటూ.. అప్పుడప్పుడు చందాయిపేటలో వ్యవసాయ పనులు చూసుకునేవాడు. మొదటి భార్య శైలజకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే చందాయిపేటలో ఉందామని నవీన్‌కుమార్ మౌనికతో అనడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు నవీన్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాలరాజు చందాయిపేటకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్ది, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రన్నింగ్ బస్సు దిగబోయి ఆర్టీసీ డ్రైవర్ మృతి

హైదర్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణిస్తున్న బస్సులోంచి దిగబోయిన ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై పడి మృతిచెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ రామచంద్రాపురంలో నివాసముండే రాజశేఖర్‌రెడ్డి(50) కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సొంత పనుల నిమిత్తం కూకట్‌పల్లి ప్రగతినగర్ వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ప్రగతినగర్ నుంచి మెహదీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ వద్దకు రాగానే బస్ ఆపకుండానే రన్నింగ్‌లో దిగేందుకు ప్రయత్నించాడు. నియంత్రణ కోల్పోయిన రాజశేఖర్‌రెడ్డి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం



భాగమ్మ (ఫైల్)

వెల్దుర్తి, జూన్ 9: అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లి అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యమైంది. వెల్దుర్తి మండలంలోని మనేపల్లి, కౌడిపల్లి మండలంలోని కంచన్‌పల్లి శివారులోని చింత గున్నబండ అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. మనేపల్లికి చెందిన చాకలి భాగ్యమ్మ(55) ఏప్రిల్ 19న అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఆదివారం ఉదయం అటవీ ప్రాంతంలో మేకల కాపరులు ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు భాగ్యమ్మగా గుర్తించారు. సంఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాచారం

'రెండురోజుల్లో స్కూల్ యూనిఫాం అందాలి'

తూప్రాన్, జూన్ 9: మండలంలోని పాఠశాలలకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్‌లు) రెండు రోజుల్లో అందజేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చెన్నమనేని శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం తూప్రాన్ ఐకేపీ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న ఏకరూప దుస్తులు తయారీని పరిశీలించారు. ఐకేపీ కార్యాలయంలో 21 ప్రాథమిక పాఠశాలకు అందజేసేందుకు ప్యాకింగ్ చేస్తున్న దుస్తులను శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం రుక్మిణి తదితరులు ఉన్నారు.

'నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై విచారణ జరపాలి'

నారాయణఖేడ్, జూన్ 9: దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షా పత్రాల లీకేజీలపై విచారణ విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి డిమాండ్ చేశారు.

పిడుగుపాటుతో గేదె మృతి

నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి పిడుగుపాటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన భీమప్ప ఇంటి సమీపంలో చెట్టు కింద గేదెను కట్టేయగా పిడుగు పడడంతో మృతిచెందిందన్నారు. గేదె విలువ రూ.90 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం భీమప్పను ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ సంజుపటేల్ కోరారు.

శ్రద్ధగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలి: ఎమ్మెల్యే



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 9: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. ఆదివారం నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2001-2004 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. తాను ప్రభుత్వ బడిలోనే చదువుకున్నానన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని విజ్ఞప్తి చేశారు. నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ క్రిష్ణకుమార్ కృషి వల్ల రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, వారు సాధించిన ఫలితాల వల్లే గ్రంథాలయానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే నారాయణఖేడ్ కళాశాలకు ఉత్తమ కళాశాల అవార్డుతో పాటు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు లభించిందని చెప్పారు. అనంతరం నారాయణఖేడ్ ప్రాంతం నుంచి అత్యుత్తమ ఫలితాలు సాధించిన పది, ఇంటర్ విద్యార్థులకు ఇంపాక్ట్ సంస్థ, సాయిబాలాజీ గ్రూప్ ఆఫ్ సర్వీసెస్ ద్వారా జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నాగల్‌గిద్ద ఎంపీపీ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, ఇంపాక్ట్ ప్రతినిధి సంతోష్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు సన్మానం



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న వేణుమాధవ్

సదాశివపేట, జూన్ 9: కేంద్రమంత్రిగా ఎన్నికైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాధవ్ ఆదివారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకోవడంపై సామాన్య కార్యకర్తలకు ప్రధాని మోదీ ఇచ్చిన గౌరవమని వేణుమాధవ్ పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు మనోహర్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఎన్ఆర్ఐ ఆనంద్‌నగర్‌లో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పటాన్‌చెరు, జూన్ 9: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఆర్ఐ ఆనంద్‌నగర్ కాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్ సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. పదేళ్లలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ స్వరూపాన్ని సమూలంగా మార్చామన్నారు. ఒకప్పుడు నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే మున్సిపాలిటీలో నేడు మిషన్ భగీరథ ద్వారా చేపట్టిన పనులతో నీటి సమస్య తీరిపోయిందన్నారు. లింక్‌రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, భూగర్భ డ్రైనేజీలు, పార్కులను పెద్దఎత్తున అభివృద్ధి చేశామని తెలిపారు. సొంత నిధులతో కాలనీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి ఇచ్చిన వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బీరంగూడ గోశాలను సందర్శించి నిర్వహణను పరిశీలించారు.

సమాజ మార్పు కోసం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు

- మంత్రి దామోదర్ సతీమణి పద్మిని



కల్కి అమ్మభగవాన్ కల్యాణ వేడుకల్లో పద్మిని

సంగారెడ్డి టౌన్, జూన్ 9: సమాజ మార్పుకోసం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని తెలిపారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కల్కి అమ్మభగవాన్ కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల వల్ల ఎన్నోరకాలుగా ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు కలివేముల సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన సురేష్‌షెట్కార్



కర్ణాటక డిప్యూటీ సీఎంతో మల్లికార్జున్ ఖర్గేను కలిసిన సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 9: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందిన సురేష్‌షెట్కార్ ఆదివారం కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా సురేష్‌షెట్కార్ మొదటి జాబితాలోనే తన పేరును ప్రకటించారని, అందరి ఆశీస్సులు సహకారంతో విజయం సాధించానని తెలిపారు. అనంతరం ఆయనను సురేష్‌షెట్కార్ ఘనంగా సన్మానించారు.

'సురేష్‌షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'

నారాయణఖేడ్, జూన్ 9: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన సురేష్ షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు ప్రకాష్‌రాథోడ్ అన్నారు. ఆదివారం ఆయన నారాయణఖేడ్‌లో మాట్లాడుతూ సురేష్‌షెట్కార్ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి వచ్చారని, తెలంగాణ పోరాటంలోనూ పాల్గొన్నాడన్నారు. ఆయన వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తి అని, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి అని, అందువల్ల టీపీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టాలన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కొల్చారం: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కొల్చారం, జూన్ 9: కొల్చారం మండలం దేవుని వెంకటాపూర్ గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పట్వారి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి అభిషేకం, అలంకరణ కార్యక్రమం పురోహితుడు కోలాచల కృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పట్వారి ప్రసాద్ పంతులు, శ్రీనివాస్‌శర్మ, కృష్ణశర్మ, హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్రరావు, నిజాంపేట్ నుంచి అన్నారావు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో దుర్గమ్మ బోనాలు

రామాయంపేట, జూన్ 9: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం దుర్గమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఏటా జరిగే ఉత్సవాల్లో భాగంగా ఈసారి కూడా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని కదిలారు. పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల నడుమ సంబురాలు అట్టహాసంగా సాగాయి.

రామంతపూర్ మూలవాగుపై బ్రిడ్జిని నిర్మించండి

మాసాయిపేట, జూన్ 9: మాసాయిపేట మండలంలోని రామంతపూర్ గ్రామం మూలవాగు నుంచి హల్దీవాగు నీటి కాలువపై బ్రిడ్జిని లేదా కాజ్‌వేను నిర్మించాలని రామంతపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని ఊర చెరువు నుంచి మూలవాగు ద్వారా హల్దీవాగుకు చేరే భారీ నీటి ప్రవాహంతో ప్రతియేడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ మార్గంలో బ్రిడ్జిని లేదా కాజ్‌వేను నిర్మించాలని ఎన్నోఏళ్లుగా రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బ్రిడ్జిని నిర్మిస్తే రామంతపూర్‌తో పాటు అచ్చంపేట, హకీంపేట, దరిపల్లి, గోపాలకృష్ణపురం తదితర గ్రామాలకు రాకపోకలు సాగుతాయని రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

మోకాళ్లపై తిరుమల కొండ ఎక్కిన షెట్కార్ అభిమాని!



మోకాళ్లపై తిరుమల కొండ ఎక్కుతున్న శేరికార్ నందు

నారాయణఖేడ్, జూన్ 9: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సురేష్‌షెట్కార్ విజయం సాధించడంతో, నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోకాళ్లపై తిరుమల కొండ ఎక్కి మొక్కు తీర్చుకున్నారు. సురేష్‌షెట్కార్ ఎంపీగా గెలిస్తే మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కాడు. షెట్కార్ విజయం సాధించడంతో పలువురు కాంగ్రెస్ అభిమానులతో కలిసి నందు శేరికార్ తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకున్నాడు.

ఆవుకు రెండు తలల దూడ జననం



రుద్రారంలో రెండు తలల దూడ

చిన్నశంకరంపేట, జూన్ 9: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామ రైతు పులగల్ల నర్సింహులుకు చెందిన ఆవు ఆదివారం రెండు తలల దూడకు జన్మనిచ్చింది. మేత మేస్తున్న క్రమంలో ఆవు పురిటి నొప్పులను గమనించిన యజమాని పశువైద్యులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న అసిస్టెంట్ పశువైద్యాధికారి వేణుగోపాలమిత్ర సిబ్బందితో కలిసి ఆవుకు వైద్యం చేస్తున్న సమయంలో రెండు తలల దూడకు జన్మనిచ్చింది. ఆవు ఆరోగ్యంగానే ఉన్నా.. పుట్టిన కొద్దిసేపటికే రెండు తలల దూడ చనిపోయింది. రెండు తలల దూడను ప్రజలు ఆసక్తిగా చూశారు.

'ఆటా' మహాసభల్లో తెలంగాణ మంత్రులు



ఆటా మహాసభల్లో మంత్రులు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్

జహీరాబాద్, జూన్ 9: ఆమెరికాలోని తెలుగు సంఘం వారు 7,8,9 తేదీల్లో నిర్వహించిన 18వ ఆట (అట్లాంట) మహాసభలకు తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమెరికాలో నిర్వహించిన మహాసభలకు సంఘం అధ్యక్షుడు మధు ఆహ్వానం మేరకు వారు వెళ్లారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

హత్నూర, జూన్ 9: హత్నూర మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో గల బీఎస్ఆర్ ఫాంహౌస్‌లో తుర్కలఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

మందుబాబులకు అడ్డాగా ప్రాథమిక పాఠశాల



అపరిశుభ్రంగా పాఠశాల వరండా

శివ్వంపేట, జూన్ 9: సరస్వతీ నిలయంగా భావించే పాఠశాల మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. మండల కేంద్రమైన శివ్వంపేట శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రతిరోజు మద్యం సేవిస్తుండడంతో పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత వాతావరణం నెలకొన్నది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో వరండాలో రోజూ రాత్రి సమయాల్లో మద్యం సేవించి సీసాలను, తిన్న భుజించిన విస్తరాకులను అక్కడే వదిలేసి వెళిపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ఎస్టీయూ జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్‌గౌడ్

మెదక్ అర్బన్, జూన్ 9: రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్రం 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్‌గౌడ్ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మొట్టమొదటిగా ఏర్పడ్డ ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని, దీనికి ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. జూన్ 9, 1947న ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ రంగానికి నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. ఈనెల జూన్ 12 పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నప్పటికీ బడుల్లో అనేక దీర్ఘకాలిక సమస్యలు నెలకొన్నాయన్నారు. బడులు తెరిచే నాటికి తాగునీటి, ఉచిత పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, కోశాధికారి కిష్టయ్య, జిల్లా నాయకులు భూపతిగౌడ్, శ్రీనివాస్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై ప్రధాని నరేంద్రమోదీ చిత్రం



మనోహరాబాద్, జూన్ 9: దేశ ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మనోహరాబాద్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేడోజి బ్రహ్మాచారి రావి ఆకుపై మోదీ చిత్రాన్ని గీశారు.

చేగుంట లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డులు

చేగుంట, జూన్ 9: ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ ఆవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిజామాబాద్‌లో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ అవార్డులో చేగుంట లయన్స్ క్లబ్‌కు అవార్డులు లభించాయి. ఉత్తమ చైర్మన్లుగా ద్యావ లింగమూర్తి, ఆకుల సుఖేందర్ జిల్లా గవర్నర్ వీ.లక్ష్మి చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు.

'మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివి'

రామాయంపేట, జూన్ 9: ఇరవై నాలుగేళ్లుగా పట్టణంలోని మహంకాళి ఆలయ ఈవోగా సేవలందించిన మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివని ఎంపీపీ మోహనాచారి, ఆలయ ట్రస్టీ చైర్మన్ పాండురంగాచారి కొనియాడారు. ఆదివారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో మోహన్‌రెడ్డి పదవీ విరమణ సభ నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, ధర్మకర్తలి సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.